## జ్యోత్స్న ఇలియాస్

# వైకుంఠపాళి



స సవేరా హోటల్ — రూం నెంబరు 221.

కుర్చీల్లో కూర్చున్న అభ్యర్థులు తమ పేరు ఎప్పుడు పిలుస్తారా అని ఆతృతతో ఎదురు చూస్తున్నారు.

ఇంటర్వ్యూలు రూం నెంబర్ 224లో జరుగుతున్నాయి. పొద్దున్న 11 గంటలకు ప్రారంభించిన ఇంటర్వ్యూ ఇంకా సాగుతూనే వుంది. ఇంటర్వ్యూ రూంలోకి వెళ్ళిన అభ్యర్థులు ఇద్దరు తప్ప మిగతా వారందరూ వెళ్ళిపోయారు. అంటే ఇంటర్వ్యూ రూంలోనే ఉండిపోయిన ఆ యిద్దరూ సెలక్టయినట్టా? వెయిటింగ్ రూంలో కూర్చున్న అభ్యర్థుల్లో కొందరు ఏవో మాగజైన్లు తిరగేస్తున్నారు. మరి కొంతమంది పరిచయాలు చేసుకుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఇవేమీ పట్టనట్టు విడిగా కూర్చున్నాడు హరికృష్ణ. అతన్ని చూడగానే తెలిసిపోతుంది. అతను మెడికల్ రెప్రెజెంటేటివ్ అని. మెడికల్ రెప్రెజెంటేటివ్‌గా అతనికి మంచి అనుభవం వుంది. డాక్టర్లతో, మెడికల్ షాప్ వాళ్ళతో మంచి కాంటాక్ట్స్ వున్నాయి. కానీ, ప్రస్తుతం అతను నిరుద్యోగి — ఇంతకుముందు అతను పనిచేసిన కంపెనీవాళ్ళకి అతని సామర్థ్యం మీద ఎంతో నమ్మకం వున్నా, ఆరునెలల నుంచీ పడిపోతున్న అతని సేల్స్, పనిపట్ల పెరిగిపోతున్న అతని నిర్లక్ష్యం నచ్చక, అతనికి వార్నింగ్ ఇచ్చారు.

హరికృష్ణకి వార్నింగులు అందుకునే అలవాటులేదు. ఇది కాకపోతే మరో కంపెనీ అనుకుని, వెంటనే రాజీనామా ఇచ్చేశాడు. అంతమంచి ఉద్యోగం ఎందుకు వదిలేసుకున్నావని ఇంట్లో అందరూ నిలదీసారు. ఇకపై ఏం చేయదల్చుకున్నావని అతన్ని ప్రశ్నించారు.

అయినా అతను బాధ పడలేదు. ఏది ఎలా జరిగినా బాధ పడకుండా వుండడం ఎలాగో అతనికి తెలుసు. ఎప్పుడు చూసినా, అందరితో హాయిగా కబుర్లు చెప్తూ వుంటాడు. కొత్తవాళ్ళతో కూడా ఇట్టే మాటలు కలిపేసి పరిచయం పెంచుకుంటాడు. జంకు అనేది ఏకోశానా లేని మనిషి. కొంతమందికి అతని తీరు కొంత విచిత్రంగా కనిపించినా, అతని ధోరణి కాబోలనుకుని ఊరుకుంటారు, కానీ వాళ్ళలో చాలా మందికి అసలు సంగతేమిటో తెలియదు.

ఇవాళ అతను చాలా రెస్ట్‌లెస్‌గా, చికాగ్గా వున్నాడు. పొద్దున లేచినప్పటి నుంచీ, ఒక్కమాత్ర కూడా వేసుకోలేదు. రోజుకి 20 మాత్రలు మింగేవాడికి మరెలా వుంటుంది? అలవాటు చేసుకున్న కొత్తల్లో, రెండు మాత్రలు వేసుకున్నా చాలు రోజంతా బ్రహ్మాండంగా గడిచిపోయేది. ఈ ప్రపంచంలో తను చేయలేనిది ఏదీ లేదనిపించేది. నడుస్తుంటే గాలిలో తేలిపోతున్నట్టు వుండేది. కానీ, క్రమేపీ అలవాటై, డోసేజ్ మెల్లిగా పెరిగింది. ఇప్పుడు రోజుకి 20 మాత్రాలుదాకా వచ్చింది.

తన పేరు పిలవడానికి కనీసం మరో అరగంట పట్టుందని సెక్రటరీ నడిగి తెలుసుకున్నాడు హరికృష్ణ. ఈలోగా కాస్సేపు రెస్టారెంట్‌లో కాలక్షేపం చేయవచ్చని, బ్రీఫ్‌కేసు తీసుకుని, అటుకేసి దారితీశాడు.

రెస్టారెంట్‌లో జనం ఆట్టేలేరు. కొంచెం ఆకలిగానే వున్నా, టీ మాత్రం ఆర్డరిచ్చాడు. కడుపులో ఆహారం పడితే, మాత్ర ప్రభావం కొంచెం తగ్గిపోతుంది. సర్వర్ వెళ్ళగానే బ్రీఫ్‌కేసులోంచి అయిదు మాత్రలు తీసుకుని ఒక్క గుక్కలో మింగేసాడు. బ్రీఫ్‌కేసులో అతని దగ్గర ఎప్పుడూ స్టాక్ ఉంటుంది... టీ తాగి, సిగరెట్టు ముట్టించి పదినిముషాలు అక్కడే కూర్చున్నాడు హరికృష్ణ. క్రమక్రమంగా అతనిలో చికాకు మాయమై, హుషారు వచ్చింది.

ఈల వేసుకుంటూ వెయిటింగ్ రూంలోకి తిరిగి వచ్చిన హరికృష్ణ, అప్పుడే అక్కడికి వచ్చిన రీజనల్ మానేజర్ సెక్రటరీని ఉద్దేశించి—

''యు వాంట్ మీ బై ఎనీ ఛాన్స్'' అడిగాడు.

''మిస్టర్ పి. హరికృష్ణ!''

''ఎగ్జాక్లీ''

''పదండి, మిమ్మల్ని పిలుస్తున్నారు'' అంటూ అతను ఇంటర్వ్యూ రూంవేపు నడిచాడు.

ఇంటర్వ్యూ రూంలోకి వెళ్తూ, ఏదో ఆలోచన వచ్చి ఫోటోసన్ కళ్ళజోడు జేబులోంచి తీసిపెట్టుకున్నాడు హరికృష్ణ.

* * *

''ఇంతకుముందు మీరు పనిచేసిన కంపెనీ ప్రాడక్ట్స్ ఏమిటి?'' — హరికృష్ణ ఫైలు తిరగేస్తూ అడిగాడు కంపెనీ రీజినల్ మానేజర్. వివరంగా చెప్పుకొచ్చాడు హరికృష్ణ.

''వాళ్ళు మీకిచ్చిన టార్గెట్?''

''అరవై వేలు''

''మీ రెంత చేసేవారు?''

''క్రితం ఏడు డెబ్బైఅయిదువేలు!... ఇన్సెంటివ్ కూడా తీసుకున్నాను.. కొంచెం గర్వంగా చెప్పుకున్నాడు హరికృష్ణ.

''గుడ్ — మరి ఆ ఉద్యోగం ఎందుకు మానేసారు?''

ఈ ప్రశ్న వస్తుందని ముందే ఊహించాడు హరికృష్ణ — అందుకే సమాధానం సిద్ధం చేసుకునే వచ్చాడు.

''నేనూ మా స్నేహితుడూ కలిసి ఇండస్ట్రీ ఒకటి పెట్టాలనుకున్నాం. ఆ పని కోసం రిజైన్ చేసానుకానీ చివరికి అది క్లిక్ అవలేదు''

''అంటే మీరు స్వతంత్రంగా బిజినెస్ చేసుకోవాలను కుంటున్నారు. ఒకవేళ మిమ్మల్ని సెలెక్టు చేసుకుంటే మళ్ళీ మీరేదో బిజినెస్ అంటూ రిజిగ్నేషన్ ఇస్తారేమో''

రీజినల్ మానేజర్ అడిగిన ఈ ప్రశ్న కూడా హరికృష్ణ ఊహించినదే.

''ఇప్పుడా ఉద్దేశం లేదు. మీక్కావలిస్తే కాంట్రాక్టు సైన్ చేస్తాను''

తన సమాధానం రీజినల్ మానేజర్‌ని సంతృప్తి పరిచిందనే అనుకున్నాడు హరికృష్ణ. ఆ తరువాత అడిగిన వన్నీ అతను పనిచేసిన కంపెనీ ప్రాడక్ట్స్ గురించి — టకటకా సమాధానాలు చెప్పేశాడు.

''మీరు కూడా ఆసోఫాలో కూర్చోండి. మిగతా కాండిడేట్స్‌ని స్క్రీన్ చేసాక మీతో మాట్లాడ్తాం'' అన్నాడు రీజినల్ మానేజర్. ప్రిలిమినరీలో సెలక్టయి అప్పటికే అక్కడ కూర్చున్న వాళ్ళిద్దరికేసి పరిశీలనగా చూస్తూ వెళ్ళి, వాళ్ళపక్కనే కూర్చున్నాడు హరికృష్ణ. వాళ్ళిద్దరూ తనకన్నా బాగా చిన్నవాళ్ళనిపించింది అతనికి పర్సనాలిటీ కూడా గొప్పగా లేదు. ఈ ఉద్యోగం తనకే వ

**ఒక్కసారి పూర్తిగా మానేయడం అసాధ్యం... మంచిది కాదు కూడా కనుక క్రమక్రమంగా డోసేజ్ తగ్గించుకొంటూ రావాలి... అలాగే రోజుకి 20 మాత్రల నుంచి 5 మాత్రల వరకూ తగ్గించుకోగలిగాడు......!**



స్తుందని ఎందుకో అనిపించింది హరికృష్ణకి.

అంతలో మరో అభ్యర్థిని రూంలోకి తీసుకొచ్చాడు సెక్రటరీ. చాలా నెర్వస్‌గా కూర్చున్నాడా కుర్రాడు. అతనేం సెలక్టవుతాడులే అనిపించింది.

"మీ డేట్ ఆఫ్ బర్త్ రాయలేదే అప్లికేషన్‌లో" అడిగాడు రీజినల్ మానేజర్ ఆ కుర్రాడిని.

"సారీ సర్! మర్చిపోయాను. నా డేట్ ఆఫ్ బర్త్ 1955" రీజినల్ మానేజర్ నవ్వేశాడు.

"అంటే మీరు 1955 సం. పొడుగుతా పుట్టారన్నమాట" హరికృష్ణకి జోక్ చాలా నచ్చింది. పకపకా నవ్వేశాడు ఎందుకొస్తారో ఇలాంటి వాళ్ళు ఇంటర్వ్యూలకి!

"అదేసార్, నేను 1955 అక్టోబర్లో పుట్టాను"

హరికృష్ణకి నవ్వాగడంలేదు. "అంటే మీరు 1955 అక్టోబర్ నెలంతా పుట్టారా!" అన్నాడు బిగ్గరగా నవ్వుతూ.

మీరు మాట్లాడకండి అంటూ సైగచేసి, రీజినల్ మానేజర్ ఆ కుర్రాడిని మరికొన్ని ప్రశ్నలు వేశాడు. అప్పటికే పూర్తిగా కన్‌ఫ్యూస్ అయివున్న ఆ కుర్రాడి అవస్థలు హరికృష్ణకి భలే సరదాగా వున్నాయి.

"మీ దగ్గర వెహికల్ వుందా?" రీజినల్ మానేజర్ అడిగిన ప్రశ్నకు లేదనట్టు తలూపుతూ సమాధానం చెప్పాడా కుర్రాడు.

"ఇక మీరు వెళ్ళవచ్చు. మీకు ఉత్తరం రాస్తాం" అని అతడిని పంపించేశాడతను.

తన దగ్గర స్కూటర్ వున్న సంగతి రీజినల్ మానేజర్‌తో ఎలాగైనా చెప్పాలనిపించింది హరికృష్ణకి.

"ఎక్స్క్యూస్ మీ సర్!"

ఏమిటన్నట్టు చూశాడు రీజినల్ మానేజర్.

హరికృష్ణ కళ్ళజోడు తీసేస్తూ, "మీరిందాకే అడుగుతారనుకున్నా. ఈ కళ్ళజోడు పవర్‌గ్లాస్ కాదు. స్కూటర్ నడిపేటప్పుడు నేను పెట్టుకునే రైడింగ్ గ్లాసెస్ ఇవి!"

అతనికేసి పరీక్షగా చూస్తున్నాడు రీజినల్ మానేజర్.

"ఏమిటిసార్ అలా చూస్తున్నారు?" నవ్వుతూ అడిగాడు హరికృష్ణ—

"మీ కళ్ళు ఎర్రగా వున్నాయేం? కళ్ళకింద ఆ చారలేమిటి మిస్టర్ హరికృష్ణ?"

ఒక్క క్షణం తటపటాయించాడు హరికృష్ణ.

"అబ్బే ఏంలేదే! రాత్రి నిద్రపోలేదు సరిగ్గా"

"లేదు మిస్టర్ హరికృష్ణా. నాకిందాకే అనుమానం వచ్చింది మీధోరణి చూసి. ఇప్పుడు ఆ అనుమానం ధృడపడింది. మీరు ఎల్లెస్డీ తీసుకుంటారుకదూ?"

ఇతనికి ఆ మాత్రల గురించి బాగా తెల్సివుండాలి. నిజం చెప్పడమే మంచిదనిపించింది హరికృష్ణకి.

"నేను అడిక్ట్ కాలేదు సార్.. ఏదో అప్పుడప్పుడు.."

"నో, యు ఆర్ ఎన్ ఎడిక్ట్!"

హరికృష్ణ అతడి కళ్ళలోకి సూటిగా చూడలేకపోయాడు.

"ఐ ఆమ్ సారీ మిస్టర్ హరికృష్ణ! మా కంపెనీలో డ్రగ్ ఎడిక్ట్స్‌కి స్థానంలేదు. మీ అలవాటు పూర్తిగా మానుకున్న తరువాత, మీ కవసరమనిపిస్తే వచ్చి నన్ను కలుసుకోండి, గుడ్ బై"

ఇంటర్వ్యూ అయిపోయింది

క్షణాల్లో ఫలితం కూడా తెలిసిపోయింది.

హరికృష్ణకి మళ్ళీ చికాకు ప్రారంభమైంది. దార్లో ఒక ఇరానీ హోటల్ దగ్గర స్కూటర్ ఆపి, మరో అయిదు మాత్రలు వేసుకుని టీ తాగాడు. ఇది రాకపోతే, మరో ఉద్యోగం వస్తుంది లెమ్మని నిర్లక్ష్యంగా బయటికి నడిచాడు. స్కూటర్ స్టార్ట్‌చేసి, ట్రాఫిక్‌తోపాటు నెమ్మదిగా డ్రైయివ్ చేసుకుంటూ బయల్దేరాడు. అంతలో ఒక మోటర్‌సైకిల్ పెద్ద మోతతో అతడ్ని దాటుకుంటూ ముందుకు దూసుకుపోయింది. ఆ మోటర్‌సైకిల్ని ఓవర్‌టేక్ చేయాలనిపించింది హరికృష్ణకి — అంతే... ఆక్సిలేటర్ పూర్తిగా తిప్పేశాడు.

* * *

ఫ్రాక్చర్ అయిన చేత్తో రెండునెలలు చాలా అవస్థపడ్డాడు హరికృష్ణ. ప్రతిచిన్న విషయానికీ ఇంట్లోవాళ్ళ మీద ఆధారపడవలసి వచ్చేది. బయటికి కదల్లేని పరిస్థితి... తన దగ్గరున్న మాత్రల స్టాక్ అయిపోవచ్చింది. సాయికుమార్‌ని పిలిపించి, మాత్రలు తెచ్చిపెట్టమని అడిగాడు.

ఈ మధ్యన మాత్రల్ని నిషేధిస్తూ, వాటిని షెడ్యూల్ ఏసీలో వుంచారనీ, ఇంక వాటిని సంపాదించడం అసాధ్యమనీ అన్నాడతను. బ్లాక్‌లో మూడేసి రూపాయలకు ఒకో మాత్ర అమ్మే ఒక అతని చిరునామా సాయికుమార్‌కి చెప్పి, అతని ద్వారా కొన్ని మాత్రలు సంపాదించుకున్నాడు...

బ్యాంక్‌లో డబ్బులన్నీ మాత్రలకే అయిపోతున్నాయి. అన్నయ్యని డబ్బులడగడం ఏ మాత్రం ఇష్టంలేదు. తన పరిస్థితికి తనమీదే బాగా అసహ్యం కలిగింది, "ఈ వేళ్టినుంచీ ఈ అలవాటు మానుకోవాలి... నా ఈ పరిస్థితికి కారణం పూర్తిగా ఈ మాత్రలే" అని ఒక రోజు అనుకున్నాడు.

ఒక్కసారిగా పూర్తిగా మానేయడం అసాధ్యం... మంచిది కూడా కాదు కనుక, క్రమక్రమంగా డోసేజి తగ్గించుకుంటూ రావాలి... అలాగే, రోజుకి 20 మాత్రలనుంచీ 5 మాత్రల వరకూ తగ్గించుకోగలిగాడు. చేతికి కట్టిన ప్లాస్టర్ తీసేసిన రోజు ఒక్కమాత్ర కూడా వేసుకోలేదు...

ఇంక అలవాటు పూర్తిగా మానేసినట్టే. హరికృష్ణ మొహంలో కూడా ఎంతో మార్పు వచ్చింది. కళ్ళలో ఎర్రజీరలు బాగా తగ్గాయి, మొహంలో కళ వచ్చింది.

ఆ మర్నాడే అతనికి ఓ చిన్న కంపెనీ నుంచి ఇంటర్వ్యూ పిలుపు వచ్చింది, కానీ ఇంటర్వ్యూ ఆ రోజే... మధ్యాహ్నం 2 గంటలకి, అంటే వ్యవధి ఎంతోలేదు. గబగబ కాగితాలు సర్దుకుని, మొహం కడిగేసుకుని బయల్దేరాడు. భోజనానికి కూడా టైములేదు, బస్సులో తారనాక దాకా వెళ్ళాలి. సమయానికి చేరుకోగలడా? పోనీ ఆటోలో వెళ్ళిపోతేనో?... కానీ ఆటోకి డబ్బులు సరిపోవే... జేబులో పదిరూపాయలే వున్నాయి... అవే తన దగ్గిర వున్న డబ్బులు..

ఖాళీగా వున్న ఒక ఆటో దగ్గరకెళ్ళి "వస్తావా" అనడిగాడు హరికృష్ణ.

"ఎక్కడికి సాబ్?"

"తారనాక"

రానంటూ తలూపాడు ఆటో డ్రైవర్, దగ్గర్లో మరో ఆటో కనిపించలేదు. ఏం చెయ్యాలి?...

"రానంటే ఎలా?... అర్జెంటుగా ఇంటర్వ్యూకి వెళ్ళాలి. ఉద్యోగం లేక అవస్థపడుతున్నాను"... హరికృష్ణ ఇలా ఎవర్ని వేడుకోలేదు.

ఆటో డ్రైవర్ ఏమనుకున్నాడో ఏమో, మీటర్ తిప్పుతూ 'కుర్చోండి సాబ్' అన్నాడు.

హరికృష్ణ కదల్లేదు. ఏమిటన్నట్టు చూసాడు ఆటో అతను.

"తారనాకా వెళ్ళడానికి ఎంతవుతుంది!"

"పన్నెండు రూపాయలవుతుందేమో... ఎందుకు సాబ్!"

"నా దగ్గర పది రూపాయలే వున్నాయి..."

"పర్వాలేదు, కూర్చోండి, ఉద్యోగం దొరికితే తర్వాత ఎప్పుడైనా ఇవ్వొచ్చు. నేను రోజూ ఇక్కడే వుంటాను..." ఆటో స్టార్ట్ చేశాడతను. హరికృష్ణ ఆటోలో కుర్చున్నాడు.

"మీ పేరేమిటి?" మర్యాదగా అడిగాడు ఆటోడ్రైవర్ని, అతనితో మాటలు కలిపి, సంభాషణ పెంచాలనిపించింది. కానీ ఆటో హోరులో వీలుపడక, ఊరుకున్నాడు.

తారనాకలో కంపెనీ ముందు ఆటో ఆగింది. మీటర్ 11.40 పైసలైంది. హరికృష్ణ పదిరూపాయలు తీసి ఆటోడ్రైవర్ చేతిలో పెట్టాడు.

"చాలా థాంక్స్"... అని మాత్రం అనగలిగాడు. గోపాలం తన జేబులోంచి రెండురూపాయలు తీసి హరికృష్ణకిస్తూ "ఇంటికెళ్ళడానికి బస్సు ఛార్జీ ఉంచుకోండి సాబ్" అని ఆటోస్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయాడు.

ఇంటర్వ్యూకి ఇంకా పదిహేను నిముషాలుంది. హరికృష్ణ నెమ్మదిగా లోపలికి వెళ్ళాడు. కంపెని కొత్తది. హరికృష్ణ అర్హతలు, అనుభవం మానేజింగ్ డైరెక్టర్‌కి నచ్చాయి.

"జీతం ఏ మాత్రం ఎక్స్‌పెక్ట్ చేస్తున్నారు?" అడిగాడాయన.

"నా అర్హతల్ని దృష్టిలో పెట్టుకుని మీ కంపెనీ ఎంత ఇచ్చినా నాకు సమ్మతమే." అన్నాడు హరికృష్ణ.

"గుడ్. అయితే రేపట్నించే మీపని ప్రారంభించండి. ప్రస్తుతం నెలకి 500 రూపాయలు ఇస్తాం. దానితోపాటు డైలీ అలవెన్స్ రోజుకి 12 రూపాయలు మరో మూడు నెలల్లో మీకు మంచి రెయిజ్ ఇస్తాం"

"ఓకే సర్." ఇంత సులభంగా ఉద్యోగం వస్తుందని అనుకోని హరికృష్ణకి ఇపుడు మనస్సు తేలిగ్గా వుంది. ఇకపై తను ఎవరిమీద ఆధారపడనవసరం లేదు. తన స్కూటర్ అమ్ముకోనవసరం లేదు. మానేజింగ్ డైరెక్టర్ దగ్గర సెలవు తీసుకుని బయటపడ్డాడు.

గేటుదగ్గర ఓ చెట్టుకింద ఆటో ఒకటి నిలబడి వుంది. తన దగ్గర రెండు రూపాయలే వున్నాయి. అయినా ఫర్వాలేదు. ఉద్యోగం దొరికింది కనుక, ఆటోలో వెళ్ళి, ఇంట్లో ఒదిన దగ్గర తీసుకుని ఇవ్వవచ్చు.

ఆటో అతను మొహం మీద తువ్వాలుకప్పుకుని



టాపిక్

మధు శారద పార్కులో కలుసుకున్నారు.


"డాళింగ్... నువు లేనిదే నేను బ్రతకలేను..." అన్నాడు మధు.

"నువ్వన్నా నాకెంతో ఇష్టం. నిన్ను విడిచి వుండలేను... మరి మనం పెళ్ళి చేసుకుందామా!" అంది శారద.

"అబ్బా... అదుగో... అప్పుడే టాపిక్ మార్చేస్తున్నావు" అన్నాడు మధు.

—మంత్రాల (శ్రీకాకుళం)

పేరు



వెనుక సీట్లో పడుకుని వున్నాడు.

"వస్తావా బాబూ!" అంటూ ఆటో అతని కాలి మీద తట్టి లేపాడు హరికృష్ణ. మోహం మీద నుంచి తువ్వాలు తీసుకుని తుడుచుకుంటున్న ఆటో డ్రైవర్ని చూసి విస్తుపోయాడు.

"మీరింకా వెళ్ళలేదా?"

"లేదు సాబ్. మీరు లోపలికి వెళ్ళాక మీకోసం వెయిట్ చేద్దామనుకున్నాను, రండి వెడదాం... ఇంటి దగ్గర దింపేస్తాను" అన్నాడు గోపాలం.

"థాంక్స్యూ" అంటూ ఆటో ఎక్కాడు హరికృష్ణ.

ఇదీ ఒకందుకు మంచిదేననిపించింది అతనికి, ఇంటికి వెళ్ళి అతని బాకీ తీర్చేయవచ్చు. మొత్తానికి ఇవాళ లేచిన వేళా విశేషం... అంతా సాఫీగా జరిగిపోయింది. ఆటో నారాయణగూడ వచ్చేవరకూ గోపాలంతో ఏవో కబుర్లు చెప్తూ కాలక్షేపం చేశాడతను.

సిగ్నల్ లైట్స్ దగ్గర ఆగింది ఆటో. కార్నర్లో వున్న పాన్‌షాప్ దగ్గర నీలం రంగు సిల్కు లాల్చీ, పైజమా వేసుకుని సిగరెట్ కాల్చుకుంటున్న అతన్ని చూడగానే, ఆటో అటువైపుకి మళ్ళించి ఆపమన్నాడు, అవును!... అతను రఘువీరే!

"హల్లో రఘువీర్" అంటూ ఆటోలోంచి దిగి పాన్‌షాప్‌కేసి నడిచాడు హరికృష్ణ.

"ఏమిటి ఈ మధ్య అసలు కనబడ్డమే లేదు!" అడిగాడు రఘువీర్.

"ఆ మధ్య ఆక్సిడెంట్ అయి చెయ్యి ఫ్రాక్చర్ అయింది. రెండు నెలలనుంచీ ఎక్కడికీ కదలడం లేదు నేను."

"పద, టీ తాగుదాం" అన్నాడు రఘువీర్.

"ఆటో అతనికి డబ్బులివ్వాలి"

"మరి ఇచ్చేసిరా... మరో ఆటోలో వెళ్ళవచ్చు"

"అలా కాదు. నా దగ్గర డబ్బుల్లేవు... ఇంటికి వెడితేగానీ ఇవ్వలేను."

హరికృష్ణను పక్కకి జరుపుకుంటూ ఆటోకేసి నడిచాడు రఘువీర్

"ఎంతయిందోయ్?"

"సాబ్‌కి తెల్సు" అన్నాడు గోపాలం.

"ఓ ఇరవై రూపాయలు ఇచ్చెయ్ రఘువీర్" వెనుకనుంచి హరికృష్ణ చెప్పాడు.

జేబులోంచి నోట్ల కట్ట తీసి ఇరవై రూపాయల నోటు ఆటో అతని చేతికిచ్చి వెనక్కి తిరిగాడు రఘువీర్. హరికృష్ణ కేసి అదోలా చూస్తు ఆటో స్టార్ట్ చేసి వెళ్ళిపోయాడు ఆటో డ్రైవర్ గోపాలం.

మరోసారి అతడికి థాంక్స్ చెప్పివుండాల్సింది అనుకున్నాడు హరికృష్ణ. ఆలోచిస్తూ, రఘువీర్ వెనకే, దగ్గర్లో వున్న హోటల్లోకి నడిచాడు.

టీ తాగాక, సిగరెట్ ముట్టిస్తూ అడిగాడు రఘువీర్.

"ఏమిటి, స్టాక్ కోసం రావడం లేదసలు!"

"డబ్బుల్లేవు బ్రదర్, క్రితం సారి తీసుకున్న దానితోనే ఇన్నాళ్ళూ గడుపుకున్నాను. ఉద్యోగం కూడా లేదు కదా"

"దానిదేముంది? మన మధ్య ఇది మామూలేగా? డబ్బులు వున్నపుడే ఇవ్వవచ్చు. ఇదిగో ఈ పాకెట్ వుంచు, అసలు ఇది ఇంకొకరి కోసం వుంచాను."

"థాంక్స్..." అంటూ పాకెట్ అందుకున్నాడు హరికృష్ణ.

"రేటు కొంచెం పెరిగింది గురూ... మన బొంబాయి మనిషి వందకి నాలుగువందలు అడుగుతున్నాడు, నీ దగ్గర నాకు కమీషన్ వద్దులే... అంతే ఇచ్చేయ్.. సరిపోతుంది... తొందర్లేదు... జీతం వచ్చాకే ఇవ్వవచ్చు..."

పాకెట్‌ని పదిలంగా బ్రీఫ్‌కేసులో పెట్టుకున్నాడు హరికృష్ణ.



లక్కీ నెం

"నీ లక్కీ నెంబర్ ఎంతోయ్?!" అడిగాడు రామానుజం.

"జీరో..." చెప్పాడు బ్రాకెట్స్ ఆడే బాబారావు.

—బి.వి.యస్.బాబు (తెనాలి)


రోజంతా తుమ్ముతూ గడపకండి



జలుబు వల్ల ఒక మంచి రోజును పాడవనివ్వకండి. ముక్కు కారడం, ఛాతీలో కఫం మరియు తలభారం. ఇవన్నీ జలుబు లక్షణాలు. మీరు బాధపడుతారు. ఒక మంచి రోజు పాడవుతుంది. మరి అలాంటప్పుడు తెలివైన పని ఎందుకు చేయకూడదు? కోల్డరిన్ వాడి చూడండి. ఇది ప్రత్యేకంగా తయారు చేయబడిన జలుబు బిళ్ల. ఎంతో అనుకూలమైనది. ఎంతో ఉపశమనం ఇస్తుంది.

జలుబుతో బాధ పడటం ఎందుకూ? కోల్డరిన్ తీసుకోకూడదూ?




CASBC-111-124 TEL